ప్రజాశక్తి

శుక్రవారం 29 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఫార్మాలో ప్రాణాలకు రక్షణేది ?

◆ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భద్రత పతనం

◆ వరుస ప్రమాదాలు ◆ నియంత్రణకు చర్యలు శూన్యం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై విచారణ కమిటీల నివేదికలు రాకముందే వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం కార్మికుల ప్రాణాలను బలితీసుకుంటోంది. ఈ విధానంలోని లోపాలను సరిదిద్దకుండా మరింత ఉల్లంఘనలకు యాజమాన్యాలు పాల్పడేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఎన్ని ఉల్లంఘనలకు పాల్పడినా ప్రభుత్వం తమ పక్షాన ఉందని భావించి యాజమాన్యాలు కనీస భద్రత, రక్షణ ప్రమాణాలను అమలుచేయడంలేదు. పరిశ్రమల తనిఖీ అధికారుల అధికారాలకు ప్రభుత్వం కోత పెట్టడంతో పరిశ్రమల్లో కార్మికుల భద్రతను యాజమాన్యాలు దాదాపు పట్టించుకోవడం మానేశాయి. ఆ దుష్ఫలితాలే ప్రమాదాల రూపంలో కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 21న అసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మృతిచెందారు. 38 మంది గాయపడ్డారు. ఈ గాయం మర్చిపోకముందే సినర్జిన్ కంపెనీ ప్రమాదంలో గాయపడ్డ కార్మికులు నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదాలపై నివేదికలు రాకముందే పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని ఠాగూర్ లేబొరేటరీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరొక కార్మికుడు పరిస్థితి విషమంగా వుంది. ఈ కంపెనీలో మంగళవారం అర్ధరాత్రి విషవాయువులు లీకై కార్మికులు అస్వస్థతకు గురైనా బుధవారం ఉదయం ఆరు గంటల వరకు వారిని ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. కార్మికుల ప్రాణాల పట్ల యాజమాన్యం ఎంత నిర్లక్ష్యంగా వుందో ఈ ఘటన తెలియజేస్తోంది.

పరిశ్రమల ప్రమాదాలపై ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ విచారణ పూర్తికాకముందే ఠాగూర్‌లో ప్రమాదం జరిగింది. ప్రమాదాలకు యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలిసినా వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాద తీవ్రత, ఆ సమయంలో ప్రతిస్పందనలను బట్టి కార్మిక కుటుంబాలకు యజమానులతో పరిహారం చెల్లించేలా ప్రభుత్వం మధ్యవర్తిపాత్ర పోషిస్తోంది తప్ప ప్రాణం తీసిన యాజమానులపై సరైన చర్యలు తీసుకోవడంలేదు. ఫార్మా పరిశ్రమల్లో పనిచేయడానికి కార్మికులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇళ్లు కాలిపోతే బొగ్గులేరుకొనే వాళ్లు తయారైనట్లు, ప్రమాదాలను అడ్డం పెట్టుకొని లాభపడుతున్నవారు లేకపోలేదు. కంపెనీల నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు సేకరించడంతో వున్నకొద్దిపాటి భయం కూడా యజమానులకు పోయింది.

జిల్లాలో 126 వివిధ భారీ పరిశ్రమల్లో పనిచేస్తున్న దాదాపు 68 వేల మందిలో 35 వేల మంది 81 రసాయన, ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఇంత భారీస్థాయిలో కార్మికులు పనిచేస్తున్న రసాయన, ఫార్మా పరిశ్రమల్లో అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యమూ భద్రతపై దృష్టి పెట్టడంలేదు. రెడ్ కేటగిరీలోని 190 పరిశ్రమల్లో 40 పరిశ్రమల్లోనే సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. లాభాలకు ఇచ్చిన ప్రాధాన్యతను కార్మికుల ప్రాణాలకు ఇవ్వడం లేదని సేఫ్టీ ఆడిట్ నిర్వహణ తీరు తెలియజేస్తోంది. ఇప్పటికైనా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రక్షణ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

బాధితురాలిని పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

ఫార్మా ప్రమాద బాధితులకు సిపిఎం పరామర్శ

పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీలో జరిగిన ప్రమాదంలో విషవాయువు పీల్చి అస్వస్థతకు గురై విశాఖ నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం, సిఐటియు నాయకులు గురువారం పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాశక్తి - గాజువాక : కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిఐటియు అనకాపల్లి జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావులు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సౌకర్యాలను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇంతమంది క్షతగాత్రులు కావడానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, ప్రమాదం జరిగిన తర్వాత కూడా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగి విషవాయువులు పీల్చి 29 మంది ప్రాణపాయస్థితిలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. సేఫ్టీ పరికరాలు, రక్షణ చర్యలు తీసుకుని ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేదన్నారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలకు మిగతా 2లో..

నేటి నుంచి విశాఖలో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

▶ వార్త 2లో..

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 4లో..

మహనీయుడు.. జ్యోతిరావు పూలే

▶ వార్త 7లో..

పిల్లల దత్తత చట్టబద్ధంగా ఉండాలి

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిల్లలను అమ్మినా, కార్మికులుగా మార్చినా కఠిన చర్యలు తప్పవని, పిల్లలు కావలసినవారు దత్తతను చట్టబద్ధంగా తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గురువారం ఉదయం స్థానిక ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో ఫోస్టర్ అడాప్షన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తతపై అందరికీ అవగాహన అవసరమన్నారు. రాష్ట్రంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 27 శిశు గృహాలు ఉన్నాయన్నారు. అనాథలు, వదిలివేయబడిన, అప్పగించబడిన 0-6 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు రక్షణ, సంరక్షణను అందించడంలో అవి ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం వాటిలో 108 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని, గడిచిన కాలంలో 473 మంది పిల్లలు స్వదేశీ దత్తతకు, 114 మంది పిల్లలు విదేశీ దత్తతకు ఇవ్వబడ్డారని తెలిపారు. విదేశాలకు తీసుకువెళ్లి పిల్లలను కార్మికులుగా మార్చిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అమలులో ఉన్న దత్తత విధానాలను మంత్రి తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఫార్మా ప్రమాద బాధితులకు సిపిఎం పరామర్శ

యాజమాన్యాలు ప్రాధాన్యత ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

విశాఖ కలెక్టరేట్ : విషవాయువు లీకై మృతి చెందిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఐయం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మృతుల కుటుంబ సభ్యులను కెజిహెచ్ మార్చురీ వద్ద ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలలో నిత్యం ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రమాదాలు తరువాత వేసిన కమిటీల నివేదికలు ఎప్పటికీ బయటకు రావడం లేదన్నారు. ప్రమాదాలకు కారణమైన పరిశ్రమల యాజమాన్యాలను అరెస్టులు చేయడంగానీ, శిక్షించడంగానీ చేయడం లేదన్నారు. దీంతో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. నిరంతరం పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ జరపాలన్నారు. ప్రమాదం జరిగిన తరువాత హడావుడి చేసే కంటే ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పిల్లల దత్తత చట్టబద్ధంగా ఉండాలి

ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 6 నుండి 18 సంవత్సరాల పిల్లలు మంచిగా, ఆర్థికంగా ఎదగడానికి ఫోస్టర్ అడాప్షన్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తప్పిపోయిన పిల్లల విషయాలను 1098 చైల్డ్ హెల్ప్ లైన్లకుగానీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల దృష్టికిగానీ తీసుకెళ్లాలన్నారు. ఈ విషయాలపై ప్రతి అంగన్వాడీ వర్కర్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.చిన్మయ దేవి, జాయింట్ డైరెక్టర్ విజయ, ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయ దేవి, ఎపిఎస్‌పిటిసిఆర్ ఛైర్మన్ అప్పారావు, పిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ రాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలకార్మిక కేసుల్లో యజమానులకు జరిమానా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాల కార్మిక కేసుల యజమానులకు రూ.1.2 లక్షల జరిమానాను అధికారులు విధించారు. విశాఖపట్నం జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ క్యాంపెయిన్ ప్రోగ్రామ్‌లో భాగంగా నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ బాలకార్మిక టాస్క్ ఫోర్స్ కమిటీ, కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో నెల రోజుల పాటు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత నేతృత్వంలో పలు శాఖల సహకారంతో ఈ కార్యక్రమంపై సమీక్షించారు. సర్కిల్-1లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో మొదటి బృందం 1, 2, 6, 7, 9 సర్కిళ్లపై, రెండో బృందం సర్కిల్-2 అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో 3, 4, 5, 8, 10 సర్కిళ్లపై దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా వ్యాపార సముదాయాలు, దుకాణాల తనిఖీల్లో మొత్తం 33 బాలకార్మికులను గుర్తించారు. అన్ని కేసుల్లోనూ చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. కనీస వేతనాల చట్టం కింద కార్మికులకు చెల్లించే వేతనాల్లో వ్యత్యాసాలకు సంబంధించి 33 కేసులు నమోదు చేశారు. వేతన వ్యత్యాసాల కారణంగా వివిధ యాజమాన్యాలకు రూ.1,26,325 జరిమానా విధించారు. అంతేకాకుండా బాలకార్మిక చట్టం కింద ఉల్లంఘనలకు పాల్పడిన ఐదు దుకాణాలను గుర్తించి డిమాండ్ నోటీసులు జారీ చేసి ఒక్కో షాపు యజమాని నుంచి రూ.20 వేల జరిమానా వసూలు చేశారు. అంతేకాకుండా విశాఖ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో బాలకార్మిక చట్టం కింద దుకాణ యజమానులపై ఐదు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో కార్మిక శాఖ అధికారులు, విద్య, శిశుసంక్షేమం, ఐసిడిఎస్, ఎన్‌జివో సహా కీలక శాఖల ప్రతినిధులతో కూడిన రెండు బృందాలు పాల్గొన్నాయి.

కిరండూల్ రైలుకు అదనపు కోచ్‌లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి వాల్తేరు డివిజన్‌లో విశాఖపట్నం - కిరండూల్ మధ్య నడిచే 08551/52 రైలుకు స్లీపర్, థర్డ్ ఎసి ఎకానమీ కోచ్‌లను అదనంగా జతచేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం -కిరండూల్ ప్యాసింజర్ స్పెషల్‌కు డిసెంబర్ 1 నుండి 31 వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను అదనంగా జత చేయనున్నారు. 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు డిసెంబర్ 2 నుంచి 2025 జనవరి 1 వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేయనున్నారు. 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్యాసింజర్ స్పెషల్‌కు డిసెంబర్ 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, 2025 జనవరి 1 తేదీల్లోనూ, 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు డిసెంబర్ 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31, 2025 జనవరి 2 తేదీల్లోనూ ఒక థర్డ్ ఎసి ఎకానమీ కోచ్‌ను జతచేయనున్నారు.

యాదవుడే మాధవుడు చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన వియ్యపు చిన్నారావు నిర్మాతగా, గీతా ప్రసాద్ దర్శకత్వంలో జగన్నాథ సినీ క్రియేషన్స్ నిర్మించిన యాదవుడే మాధవుడు సినిమా శుక్రవారం నగరంలోని చిత్రాలయ ఐమాక్స్ థియేటర్‌లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఆ చిత్రంలో నటించిన ఎపి మా అధ్యక్షులు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన కళాకారులతో నిర్మించిన ఈ చిత్రం తప్పనిసరిగా విజయవంతం అవుతుందన్నారు. నిర్మాత వియ్యపు చిన్నారావు మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలై జీవితాలను విచ్ఛిన్నం చేసుకునే వ్యక్తులకు కనువిప్పు కలిగే విధంగా ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. సమావేశంలో చిత్ర అసోసియేట్ దర్శకురాలు హేమ వెంకటేశ్వరి, దర్శకుడు గీతా ప్రసాద్, ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణ ప్రసాద్, పి.శివప్రసాద్, వర్రే నాంచారయ్య, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సెవెన్‌హిల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని ఎపి హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సెవెన్ హిల్స్ యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్య చర్యలకు నిరసనగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సెవెన్ హిల్స్ కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. 'కార్మిక శాఖ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగాలు కోల్పోతున్న కార్మికులు, చనిపోయిన ఒక కార్మికుని బొమ్మ'ను ప్రదర్శిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎంజిఎం సెవెన్ హిల్స్ యాజమాన్యం కొన్నేళ్లుగా కార్మికులపై ఉక్కు పాదం మోపుతోందన్నారు. ఈ విషయంపై లేబర్ డిపార్ట్‌మెంట్‌లో, కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్, కెవిపి చంద్రమౌళి, ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న సెవెన్‌హిల్స్ కార్మికులు

ఉపాధ్యాయుల ప్రాణాలు తీస్తున్న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాలయాపన, బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉన్నటువంటి రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను తక్షణమే రద్దుచేసి ఉపాధ్యాయుల ప్రాణాలను కాపాడాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎఫ్ఎల్ఎన్, ఎస్ఎల్‌టిపి పేరుతో రెసిడెన్షియల్ పద్ధతిలో నడుపుతున్న శిక్షణ కేంద్రాల్లో ఉపాధ్యాయులు మరణించడం దురదృష్టకరమన్నారు. గురువారం విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ, మరణానికి బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

భవిష్యత్తులో ఇటువంటి మరణాలు సంభవించకుండా ఉండేందుకు తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అన్ని శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలిసివచ్చే అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బాల్య వివాహ్ ముక్త్ భారత్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 50 గ్రామాలలోని 5 వేల మంది చేతులు కలిపి 'బాల్య వివాహ్ ముక్త్ భారత్'కు స్వాగతం పలికేందుకు పాదయాత్రలు నిర్వహించారు. అనంతరం జగదాంబ జంక్షన్‌లో మానహారం ఏర్పాటు చేసి, బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్య వివాహల నుంచి విముక్తి అయిన బాలికలు, మహిళలు, పురుషులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అందరూ కలిసికట్టుగా నినాదాలు చేశారు. అనంతరం ప్రతినబూనారు. కార్యక్రమంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కూటమి వ్యవస్థాపకులు, బాలల హక్కుల కార్యకర్త భువన్ రిభు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సిబ్బందికి జూట్ ఉత్పత్తుల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖపట్నం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలి అనే ఉద్దేశ్యంతో పెరికే ఫౌండేషన్ ఛైర్మన్ పెరికే వరప్రసాద్ సౌజన్యంతో రెడ్ క్రాస్ సిబ్బందికి జూట్ ఉత్పత్తులు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ జంక్షన్ రెడ్ క్రాస్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరప్రసాద్ మాట్లాడుతూ జూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు వాడి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం వరప్రసాద్‌ను రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి సత్కరించారు. కార్యదర్శి పి.రవి కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ప్రవల్లిక, జిల్లా కోఆర్డినేటర్ సంతోష్ పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖలో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీలో ఉన్న గాది రాజు ప్యాలెస్‌లో ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు క్రెడాయ్ 10వ ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం క్రెడాయ్ ఛైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి) తెలిపారు. గురువారం ఉదయం గాదిరాజు ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న శుక్రవారం ఉదయం 11 గంటలకు గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చేతుల మీదుగా 10వ ప్రాపర్టీ ఎక్స్‌పో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాపర్టీ ఎక్స్ పోలో విశాఖలోని సుమారు 71కి పైగా ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలు పాల్గొని తమ వ్యాపార కార్యకలాపాలను వినియోగదారులకు ప్రదర్శిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యుబిఐ, ఎల్ఐసి, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, ఐడిఎ తదితర జాతీయ బ్యాంకులు కూడా పాల్గొంటాయన్నారు. ఈ ఎక్స్‌పోలో 7 ప్రముఖ స్టీల్ కంపెనీలు, 35 ఇంటీరియర్ అండ్ ఎక్స్‌టీరియర్ కంపెనీలు కూడా పాల్గొంటాయని తెలిపారు. ఎక్స్‌పో కన్వీనర్ సిహెచ్.గోవిందరాజు మాట్లాడుతూ విశాఖ నగరానికి భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్, దీనికి మంచి కనెక్టివిటీ రోడ్, అవసరమైన ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, మెట్రో రైలు ప్రాజెక్ట్, నగరంలోని అంతర రహదారులు తదితర మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తే విశాఖ నగరం జాతీయ స్థాయిలో మంచి అభివృద్ధి చెందే నగరంగా రూపుదాల్చి రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్‌లా తయారవుతుందన్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగానికి సంబంధించి పలు సంస్కరణలను తీసుకువచ్చి తమకు మేలు చేస్తోందన్నారు. భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, వివిఎల్‌టి, టిడిఆర్ తదితర అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో ఇచ్చేందుకు వీలుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం డిసెంబర్ 31వ తేదీన సమగ్రమైన జిఒ రాష్ట్ర ప్రభుత్వం తేనుందన్నారు. ఇసుక కూడా ప్రస్తుతం ఉచితంగానే అందుబాటులోకి వచ్చిందన్నారు. విశాఖ నగరానికి టిసిఎస్, ఇన్ఫోసిస్ తదితర పలు సాఫ్ట్ వేర్ కంపెనీలు రానుండటం శుభ పరిణామమన్నారు. మీడియా సమావేశంలో సంస్థ గౌరవ కార్యదర్శి వి.శ్రీను, వైస్ ప్రెసిడెంట్ ఇ.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌పో వివరాలు వెల్లడిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

పిఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన

సౌరశక్తి వినియోగం ప్రచార పోస్టర్‌ను విడుదలచేస్తున్న గంటా, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల కార్యాలయంలో గురువారం పిఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 40 గిగా బైట్ల సౌర విద్యుదుత్పత్తి కోసం రూ.60 వేల కోట్లను ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. సౌర విద్యుత్తు వల్ల ప్రకృతికి నష్టం వాటిల్లదని, విద్యుత్తు బిల్లులు కూడా గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. ప్రతి ఇంటి రూఫ్ టాప్ మీద 1 కిలో వాట్ కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్లకు రూ.78 వేలు చొప్పున ప్రభుత్వ రాయితీ లభిస్తుందని, మిగతా సొమ్ము బ్యాంకులు తక్కువ వడ్డీ రేటుకు రుణాలుగా సమకూరుస్తాయని వివరించారు. జిల్లాలో ఎంపిక చేసిన ఆనందపురం, రెడ్డిపల్లి, చిప్పాడ, వెల్లంకి, ఆర్.తాళ్లవలస, గంభీరం గ్రామాలన్నీ భీమిలి నియోజకవర్గంలోనివి కావడం సంతోషకరమన్నారు. వీటిలో పూర్తి సౌర విద్యుత్తు వాడే గ్రామాన్ని ఎంపిక చేసి రూ.కోటి ప్రోత్సాహకం కింద అందిస్తామని తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో అన్నవరం గ్రామాన్ని గతంలో సౌర విద్యుత్తు గ్రామంగా మార్చామని గుర్తు చేశారు. విద్యుత్తు వినియోగం అనేక రెట్లు పెరిగిందని, దానికి తగ్గట్టు ఉత్పత్తి కూడా పెరగాలనే ఆలోచనతో పిఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని రూపకల్పన చేశారన్నారు.

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని సౌర శక్తి వాడకాన్ని ప్రజలంతా అలవాటుగా చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సౌర శక్తి వినియోగం ప్రచార పోస్టర్‌ను గంటా శ్రీనివాసరావు తదితరులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎంపిడిఒలు జానకి, విజయ్‌కుమార్, హనుమంతరావు, కూటమి నాయకులు కోరాడ రాజబాబు, డిఎఎన్.రాజు, కె.రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాది సబ్‌స్టేషన్ 11కెవి సేవానగర్ ఫీడర్‌పై మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ 3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జిసిసి లే-అవుట్, టీచర్స్ లే-అవుట్, అమరావతి కాలనీ, సూర్యా పేపర్, డ్రైవర్స్ కాలనీ (సాయిరాం కాలనీ), వెంకట్ నగర్ ఎస్‌సి.కాలనీ, మాస్టర్ స్కూల్ ఏరియా తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జోన్-2 ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఫణిరామ్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్ -2 ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఎంవిడి.ఫణిరామ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జోన్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈయన నగరంలోని ప్రధాన కార్యాలయం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన సింహాచలం రెండు రోజుల కిందట ఎసిబికి పట్టుబడటంతో ఫణిరామ్‌ను నియమించారు.

ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని రామవరం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 121 సుమారు 8 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్మార్ట్ సిటీ పేరుతో కేటాయించిన భూములను ఇటీవల కొంతమంది ఆక్రమణకు పాల్పడడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు

ఎన్ఎస్ఆర్ఐటిలో జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం వ్యాయామశాల (జిమ్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాద్‌రాజు మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఒక సాంకేతిక కళాశాలలో పూర్తి స్థాయి వ్యాయామశాల ఏర్పాటు రీజియన్‌లోనే మొదటిసారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.కనకరాజు, ఎన్.కృష్ణంరాజు, డాక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, ఢిల్లీశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యర్థాలను శుద్ధి చేసే సాంకేతికత అవసరం

ప్రజాశక్తి -మధురవాడ : వ్యర్థాలను శుద్ధిచేసి తిరిగి వినియోగించే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా వ్యర్థాల నిర్వహణ-సర్క్యులర్ ఎకానమీపై నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సులో నిపుణులు పిలుపునిచ్చారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు గురువారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంతరణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ, వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే సర్క్యులర్ ఎకానమి విధానంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. విశాఖ వంటి నగరాలలో ప్లాస్టిక్, భవన నిర్మాణ వ్యర్థాలు ప్రధాన సమస్యగా మారాయన్నారు. తీర ప్రాంతాలలో సముద్ర జలాలు కలుషితం అయి మత్స్య దిగుబడులు తగ్గుతున్నట్లు మత్స్యకారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం టెక్నాలజి, ట్రాన్స్‌లేషన్, ఇన్నోవేషన్ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్ మాట్లాడుతూ, నీతిఆయోగ్ జాతీయ ప్రణాళికలో సర్క్యులర్ ఎకానమి అంశానికి తాము మేధో సహకారం అందిస్తున్నామని తెలిపారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించే స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను, రుణాలను అందిస్తోందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునే ప్రణాళికలు అవసరమన్నారు. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొపెసర్ రాజా ఫణిపప్పు, ఈజిప్టు నేషనల్ రీసెర్చి సెంటర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ షర్నేకమెల్ అమీన్, నాట్కో ఫార్మా ఉపాధ్యక్షుడు పి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కోరమాండల్ పరిశ్రమ విశాఖ అధిపతి ఎమ్.జ్ఞానసుందరం, సదస్సు కన్వీనర్ డాక్టర్ వైఎల్‌పి.తోరణి తదితరులు ప్రసంగించారు. వ్యర్థాల నిర్వహణపై పరిశోధనలు జరుపుతున్న, కృషిచేస్తున్న వ్యక్తులను గుర్తిస్తూ లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డులను అందజేశారు. విశాఖకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ఇన్‌స్వారెబ్ వ్యవస్థాపకులు డాక్టర్ భానుమతి దాస్‌కు ఈ అవార్డును అందజేశారు. డిసెంబర్ 1వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో ఈజిప్ట్, నార్వే, జపాన్, అమెరికా దేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరై కీలక ఉపాన్యాసాలు చేయనున్నారు.

పేరెంట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిసెంబర్ 7న నిర్వహించనున్న పేరెంట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఒ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికీ ఆపార్ ఐడి నంబర్ చాలా ముఖ్యమైనదని, దీనిపై తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఇఒ ఎం.శివరాణి మాట్లాడుతూ, విద్యా పరంగా ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలను తల్లి దండ్రులకు వివరించాలని కోరారు. ఎంఇఒ-2 జయప్రద మాట్లాడుతూ, మెగా పేరెంట్స్ డే విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు.

ఉపకార ట్రస్ట్ అన్నసమారాధన

స్వాములకు అన్నసమారాధన ప్రారంభిస్తున్న కంచర్ల అచ్యుతరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి ఆరిలోవ సూర్య తేజ నగర్, శ్రీ పోలమాంబ వేపచెట్టు వద్ద ఉపకార ట్రస్ట్ ఆధ్వర్యాన అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18 రోజుల పాటు నిర్వహిస్తున్న అన్నసమారాధనకు అయ్యే ఖర్చునుఉపకార ట్రస్ట్ అధినేత, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం అన్న సమారాధనను కంచర్ల అచ్యుతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూర్యతేజ నగర్‌లో 18 రోజుల పాటు తన సొంత నిధులతో అన్నసమారాధన చేస్తున్నట్టు వివరించారు. అయ్యప్ప, భవానీ, మాలధారణ చేసిన 300 మందికిపైగా స్వాములకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక పీఠాలకు, ఆలయాలకు అంబలం పూజలకు, అన్నదానానికి భారీగా విరాళాలు ఇచ్చినట్టు తెలిపారు. ఆంధ్రజ్యోతి సమీపంలోని ఎరిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి మిలీనియం సినీ హీరో కంచర్ల ఉపేంద్ర బాబు రూ.3 లక్షలు విరాళం అందజేసినట్టు తెలిపారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ కంచర్ల అచ్యుతరావు ఉపకార ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు కొనియాడారు. ఉపేంద్ర బాబు కూడా తండ్రికి తగ్గ తనయుడులా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ సుధీర్, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ మేనేజర్ నాగు, ట్రస్ట్ ప్రతినిధులు అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -ఉక్కునగరం : దువ్వాడ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం వేర్వేరు చోట్ల 235 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పాడేరు నుంచి విశాఖ మీదుగా తమిళనాడు తరలిస్తున్న గంజాయిని దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అగనంపూడి టోల్ ప్లాజా వద్ద కారులో తరలిస్తున్న 135 కిలోల నిషేధిత డ్రై గంజాయితో పాటు లిక్విడ్ గంజాయిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జోన్ 2 డిసిపి మేరీ ప్రశాంతి వివరాలు వెల్లడించారు. అల్లూరి జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పట్టుకున్నామని చెప్పారు. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ ఇద్దరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు చెప్పారు.

మిధిలాపురిలో 100 కిలోలు పట్టివేత

దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి ఫేస్ -7 మిధిలాపురి కాలనీలో ఫలారాజ్ తమిళ సెల్వి మహిళ వద్ద వంద కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్బీడబ్ల్యూ కేసులో ఒక మహిళను విచారించేందుకు తమిళనాడుకు చెందిన పోలీసులు మీధిలాపురికి చేరుకున్నారు. విచారణలో భాగంగా ఆమె ఇంట్లో 100 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

కెడి.పేటలో 25 కిలోలు

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి పార్కు వద్ద గురువారం కారులో అక్రమంగా తరలిస్తున్న 25 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులకు వివరాలను అందజేశారు. కర్ణాటకకు చెందిన రాష్ట్రానికి చెందిన పరశురాం, రవీంద్ర అనే ఇద్దరు నాలుగు రోజుల క్రితం కారులో 12లక్షల 50వేల నగదుతో ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి గంజాయి కొనుగోలు చేయడానికి వచ్చారు. పోలీసుల నిఘా ఎక్కువ ఉండంతో ఎక్కువ మోతాదులో గంజాయి అక్రమ రవాణా చేయలేమని భావించి 25 కేజీల గంజాయిని లక్షా 25వేలకు కొనుగోలు చేశారు.ఎవరికి అనుమానం రాకుండా బ్యాగ్‌లో పెట్టి కారు వెనుక డిక్కిలో అడుగున అమర్చి తరలిస్తుండగా అల్లూరి పార్కు వద్ద చేసిన వాహన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి గంజాయితో పాటు రూ.12.6లక్షల నదు, కారు, మూడు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేట ఎస్సై తారకేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

38 మద్యం సీసాలతో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చోడవరం ఎక్సైజ్ సిఐ కెవి.బాపునాయుడు తెలిపారు ముందస్తు సమాచారంతో కొత్తపెంట రోడ్డులో తనతోపాటు హెడ్ కానిస్టేబుల్ ఎం. అప్పారావు తదితరులు మాటువేసి తనిఖీలు చేపట్టామని, మద్యం సీసాలతో వస్తున్న ఎస్.అప్పారావు, కె నారాయణరావులను పట్టుకుని, వారి వద్ద నుంచి 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

నలుగురు యువకుల అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని దారమట్టం శివుని దర్శనం చేసుకొని వస్తున్న ముగ్గురు యువకులను గాయపర్చిన యువకులను అరెస్టు చేయడం జరిగిందని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఈ నెల 17న దారమట్టం శివుని దర్శించుకొని తిరిగి వస్తుండగా గొలుగొండ గ్రామ శివారు వీరభద్రస్వామి గుడి వద్ద మద్యం మత్తులో ఈ ముగ్గురు యువకులను కర్రలతో కొట్టారన్నారు. దీంతో ఆ నలుగురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కుట్టు శిక్షణ ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : రోటరీ క్లబ్ విశాఖ సిటీ ఆధ్వర్యాన తోటగరువు, బిఎన్ఆర్.నగర్, కమ్యూనిటీ హాల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 26 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. బిఎన్ఆర్ నగర్ సామాజిక భవనంలో గురువారం క్లబ్ ప్రెసిడెంట్ కె.వెంకటరమణ, ఒకేషనల్ సర్వీసు డైరెక్టర్ బి.శివాజీ, జిఎస్.రాజు ద్వారా మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ, రోటరీ క్లబ్ సహకారంతో 2020లో ఇక్కడ 10 మిషన్లతో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి ఇప్పటి వరకు సుమారు 200 మంది మహిళలు శిక్షణ అందించినట్లు తెలిపారు.

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి-గాజువాక : విశాఖ డెయిరీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిఐటియు అనకాపల్లి జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ వద్ద డెయిరీలో పనిచేస్తున్న కార్మికుల చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలకు గురువారం వారు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. డెయిరీ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయమైనదన్నారు. డెయిరీలో వస్తున్న లాభాలను కార్మికులకు, పాల ఉత్పత్తిదారులకు ఇవ్వకుండా కోట్లాది రూపాయలను పక్కదారి పట్టించి అవినీతికి పాల్పడుతున్నారన్నారు. డెయిరీ సొమ్మును డెయిరీ యాజమాన్యం, పాలక సభ్యులు దోచుకొని ఆస్తులను పోగుజేసుకుంటున్నారని తెలిపారు. కార్మికులు, రైతులకు కోసం కట్టిన ఆసుపత్రిని కూడా ప్రైవేట్ సంస్థలకు లీజుకిచ్చారన్నారు.

కంపెనీ యాక్ట్ ప్రకారం 20 సంవత్సరాలు దాటితే రావలసిన జీతాలు, పిఎఫ్, క్యాజువల్ లీవులు, బెనిఫిట్స్ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. అదనపు పనికి ఓటీ, కనీస వేతన రూ.21 వేలు చెల్లించాలని, అగ్రిమెంట్ పద్ధతిలో ఉన్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, సంస్థ లాభనష్టాలతో సంబంధం లేకుండా బోనస్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ అమలు చేసిన వివిధ కేటగిరి ఉద్యోగుల వేతనం, ఇతర అలవెన్సులను విశాఖ డెయిరీ ఉద్యోగులకు కూడా అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, విచారణ పేరుతో తొలగించిన కార్మికులందరినీ తిరిగి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

పోస్టు కార్డు ఉద్యమంలో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ సభ్యులు

విశాఖ ఉక్కు పరిరక్షణకు పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-పెందుర్తి : విశాఖ ఉక్కు పరిరక్షణకు పోస్టు కార్డు ఉద్యమం చేపడుతున్నామని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ రమణమూర్తి అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యాన గురువారం మండల పరిషత్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. 40 సంవత్సరాలు లాభాల్లో నడిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎందుకు నష్టాల్లోకి వెళ్లిందో ఆ పార్టీ నాయకులే చెప్పాలన్నారు. వాళ్లకు అనుకూలంగా ఉండే నాయకులకు అమ్ముకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరినీ చైతన్యపరిచి నరేంద్రమోడీకి పది లక్షల పోస్ట్ కార్డులను పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

స్పోర్ట్స్ హబ్‌గా విశాఖ

ప్రజాశక్తి-గోపాలపట్నం : విశాఖను స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని విశాఖ పశ్చిమనియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయలంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన 150 రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. చెప్పినదాని కంటే ముందుగానే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రైల్వేజోన్‌కు ఇప్పటికే స్థలం కేటాయించామని తెలిపారు. పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిధులు మంజూరుచేశారన్నారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని సరిచేసుకొని అభివృద్ధివైపు పయనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు మూర్తియాదవ్, మూర్తి పట్నాయక్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అవసరం

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులకు నాణ్యమైన విద్య అవసరమని మాజీ కౌన్సిలర్ పులిచెర్ల రాజేశ్వరి అన్నారు. గాజువాకలోని శ్రీసూర్య జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని కళాశాలలో గురువారం నిర్వహించారు. వార్షికోత్సవంలో రాజేశ్వరి మాట్లాడుతూ, విద్యార్థులు మార్కులతో పాటు, విషయ పరిజ్ఞానం నేర్చుకోవాలని కోరారు. క్రమశిక్షణ కలిగిన విద్య అవసరమని అన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీపడి చదవాలని కోరారు. అనంతరం కళాశాల యాజమాన్యం రాజేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంపీ రాజశేఖర్, గుడివాడ శ్రీనివాసరావు, కృష్ణవేణి, సూర్యకుమారి, జ్యోతి, సంధ్య, అనంతరావు పాల్గొన్నారు.

పులిచెర్ల రాజేశ్వరిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

యూనియన్ నాయకుల సస్పెన్షన్ రద్దుచేయాలి

సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఎన్ఎడిలో సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికుల సస్పెన్షన్‌ను తక్షణమే రద్దుచేయాలని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ ఎన్ఎడి గేటు వద్ద గురువారం సాయంత్రం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, ఎన్ఎడిలో సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులపై పోలీసులు కేసులు పెట్టడంతో పాటు 36 మందిని యాజమాన్యం నవంబర్ 22న సస్పెండ్ చేసిందని, ఇది పచ్చి దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఎన్ఎడిలో కార్మికులు చేసిన ఓటిని ఇవ్వనని సిజిఎం మొండికేసి సమస్యలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎన్ఎడిలో కింద స్థాయి అధికారుల నుంచి జనరల్ మేనజర్ వరకు గత 30 సంవత్సరాలుగా వస్తున్న అనవాయితీని కొనసాగించమని చెప్పినా, యూనియన్లు విజ్ఞప్తి చేసినా సిజిఎం నిరాకరించారని తెలిపారు. ఒక పక్క పాత ఓటీని ఫ్యాక్టరీ యాక్ట్ పేరుచెప్పి ఇచ్చుటకు నిరాకరిస్తునే, ఆ చట్టానికి భిన్నంగా రాత్రి 8 గంటల తరువాత శని, ఆదివారంలో ఓటీ చేయమని సిజిఎం ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన సిజిఎం మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఓటీపై తన వైఖరి నేరుగా కార్మికులకే చెప్తానని పిలిచి ఆఫీసులోనికి వచ్చిన వారందరి ఫొటోలు తీసి 36 మందిని సస్పెండ్ చేయడం కార్మిక చరిత్రలోనే ఇదే మొదటిసారన్నారు. కార్మికులను ఇక్కట్లు పాల్జేస్తున్న సిజిఎంపై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఇ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి.థామస్, అధ్యక్షుడు నూకరాజు, కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పేరుతో వంచన

ప్రజాశక్తి-పెందుర్తి: సనాతన ధర్మం పేరుతో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని మహిళలను దారుణంగా వంచిస్తోందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అత్తిలి విమల, ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, ప్రముఖ అభ్యుదయ రచయిత్రి మల్లేశ్వరి అన్నారు. డిసెంబర్ 6,7,8 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న భారత జాతీయ మహిళా సమాఖ్య సదస్సును పురస్కరించుకొని జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ సమీప గిరిప్రసాద్‌నగర్ -2లోని సిపిఐ కార్యాలయం ప్రాంగణంలో సనాతన ధర్మం - మహిళల హక్కులు అనే అంశంపై ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యాన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 2014 వరకు దేశంలో మహిళలు అనేక రంగాలలో అభివృద్ధి దిశలో పయనించే వారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం మహిళలను మళ్లీ వంటింటికే పరిమితం చేసేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. హక్కులపై ప్రశ్నించే మహిళలను భక్తి భావం వైపు మళ్లించి దారుణంగా వంచిస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలోని 185 దేశాల్లో మహిళల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించగా భారత్ 145వ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో మహిళలకు సమాన హక్కులు అంశం కలగానే మిగిలిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. దేశంలో 60 కోట్లకు పైగా ప్రజలు రేషన్ అందుకుంటూ, పేదరికంలో కొనసాగుతూ ఉంటే దేశం అభివృద్ధి చెందిందంటూ బిజెపి నాయకులు వక్ర భాష్యాలు చెప్తున్నారని విమర్శించారు. బిజెపి నేతల మాటలకు మోసపోకుండా ప్రజలందరూ సమానులే అనే భావనతో ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు వనజాక్షి, ప్రధాన కార్యదర్శి బేగం, రాణి, పెందుర్తి ఏరియా నాయకులు ఎ.అన్నపూర్ణ, ఎస్.అరుణ, రజిని తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -గాజువాక : కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రభ సూచించారు. గాజువాక చైతన్య మహిళా పీజీ కళాశాలలో లయన్స్ క్లబ్ సహకారంతో గురువారం కేన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కేన్సర్ ఏ విధంగా వస్తుందని స్క్రీన్‌పై డాక్టర్ ప్రభ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రమాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒ సంతోషిదేవి, వైవిఎన్.లక్ష్మి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభనుసన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

క్లాప్ డ్రైవర్ల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధిలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ వాహన డ్రైవర్ల సమస్యలు, లోడర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గొలగాని అప్పారావు మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్స్, లోడర్స్, డైలీ వేజ్ కార్మికులు, ఆప్కాస్‌లో విలీనమైన పారిశుధ్య కార్మికులకు మిస్సయిన జీతాలు చెల్లించాలని కోరారు. క్లాప్ డ్రైవర్లు, లోడర్లకు సంబంధిత కాంట్రాక్టర్ పిఎఫ్, ఈఎస్ఐ కట్ చేసిన సొమ్ము ఆయా సంస్థలకు జమ చేయటం లేదన్నారు. డైలీ వేజ్ పేరుతో ఉన్న పారిశుధ్య కార్మికులకు 9 నెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోన్ కమిటీ నాయకులు రాము, నక్క నాగరాజు, ఎస్.గణేష్, రాజు, సత్యవతి, మీనాక్షి, బంగారురాజు, గిరి, శివ, అనిల్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నిరంతర తాగునీరు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజలకు 24 / 7 తాగునీరు అందేలా చర్యలు చేపడుతున్నట్లు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. అమత 2.0 యువజన పథకం కింద రూ.48 కోట్లుతో తాగునీటి ప్రాజెక్టు పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జివిఎంసి 14, 23, 24, 43 వార్డుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు సదుపాయం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్ రాజు, ఉషశ్రీ, పద్మారెడ్డి, రాము, శివప్రసాద్, శ్యామల దీపిక పరశురామరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

వికలాంగునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-గోపాలపట్నం : స్థానిక శోభన్‌బాబు సేవాసంఘం ఆధ్వర్యాన వికలాంగునికి రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ధనపాల్ గజేంద్ర వికలాంగుడు. ఇతని ఆలనపాలనను సోదరి చూసుకునేది. ఇటీవల ఆమె మరణించడంతో వికలాంగుడు దిక్కులేనివాడు కావడంతో శోభన్‌బాబు సేవాసంఘం ఆధ్యక్షుడు నందవరపు సోములు ఆర్థిక సాయం అందించారు.

గండి బాబ్జీకి సన్మానం

ప్రజాశక్తి -గాజువాక : ఆంధ్రప్రదేశ్ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ చైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జిని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కులపాక సన్యాసిరావు, వానపల్లి గాయత్రి ఫణికుమారి, వానపల్లి సత్య, పప్పు శ్రీనివాస్, బడిగంట్ల నీలకంఠం, వానపల్లి ఈశ్వరరావు, కొలిపాక అప్పారావు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణలను రద్దు చేయాలి : యుటిఎఫ్

అనకాపల్లి విద్యాశాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : రెసిడెన్షియల్ విధానంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వేరే జిల్లాలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అనకాపల్లి విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతినెలా బ్యాచ్‌ల వారీగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణలు ఇస్తూ రాత్రి బస కూడా అదే జిల్లాలో ఉండాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటున్న ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలంటూ అనేక మార్లు తెలియజేసినప్పటికి ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. సంవత్సరం పొడవునా శిక్షణలోనే ఉపాధ్యాయులుంటే విద్యార్థులకు బోధన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల ప్రాణాలను హరించేస ఇలాంటి శిక్షణలను వెంటనే రద్దు చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రొంగల అక్కు నాయుడు, జిల్లా కార్యదర్శులు మాకిరెడ్డి రాజనాయుడు,వి రమేష్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం వెంకటప్పారావు, ఆడిట్ కమిటీ సభ్యులు షేక్ సలీం, సీనియర్ నాయకులు మామిడి బాబురావు, దేవుడు నాయుడు, రవి, బాషా, తేజ్ వర్ధన్, ఆశ, నూతన్, నారాయణ పాల్గొన్నారు.

శిక్షణల పేరుతో శిక్షించడం దుర్మార్గం

అచ్యుతాపురం : రెసిడెన్షియల్ శిక్షణల పేరుతో ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తూ వారిప్రాణాలను బలిగొంటున్న ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అన్నారు. విజయనగరం జిల్లాలో శిక్షణ తరగతులలో ఒక హెచ్‌ఎం ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా శిక్షణా తరగతులు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలోగానీ, లేకుంటే వేసవి సెలవుల్లో, లేదా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, నిరసన తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు మద్దిల నానాజీ, ప్రధాన కార్యదర్శి కె.సుభాషిణి, రవి కుమార్, కొండబాబు, స్వర్ణ, ప్రసన్న, జి ఎస్. ప్రకాష్, మరిశెట్టి అప్పారావు, పాల్గొన్నారు

అచ్యుతాపురంలో కొవ్వొత్తులతో టీచర్ల నిరసన

మంచి మార్కులతో ఉత్తీర్ణతే లక్ష్యం

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి -చోడవరం : పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి అప్పారావు నాయుడు కోరారు. గురువారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, తరగతి గదిలో పరిశుభ్రత భవిత కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, అత్యధిక మార్కులతో పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు . అనంతరం కొత్తగా మంజూరైన సంక్షేమ హాస్టల్ స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి సత్తిబాబు దీర్ఘకాలంగా పాఠశాలకు గైర్హాజరుపై హెచ్‌ఎంతో ఫోన్లో మాట్లాడి ఆరా తీశారు. విద్యార్థి బడికి వచ్చేలా చూడాలని ఆదేశించారు కార్యక్రమంలో సిసి వెంకటేశ్వరరావు, ఎంఇఒ తిరుపతిరావు, సిఆర్‌పి కెవిఎం.నాయుడు, హెచ్‌ఎం శ్రీవల్లి పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాద ప్రాంతంలో పర్యటన

రాగూరు ఫార్మా సందర్శనలో ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మా కంపెనీలో ప్రమాద ప్రాంతాన్ని, గురవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరిశీలించారు. ప్రమాదఘటనపై కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.
రాగూరు ఫార్మా కంపెనీలో ప్రమాదస్థలాన్ని విశాఖ జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎపి ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి గురువారం సందర్శించారు. కంపెనీ యజమాని, ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు పైలా జగన్నాధరావు,కన్నూరు వెంకటరమణ, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా, డిఎం ఎల్నాయుడు, ఎం నీలబాబు పాల్గొన్నారు.

నేడు నక్కపల్లిలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి- అనకాపల్లి : పాయకరావుపేట నియోజకవర్గస్థాయి ప్రజా ర్బార్ కార్యక్రమం 29న ఉదయం 8 గంటలకు నక్కపల్లిలోని మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పాల్గొంటారని తెలిపారు. 'ప్రజా దర్బార్' కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ పాయకరావు పేట నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల మండల, డివిజనల్ స్థాయి అధికారులతో స్వయంగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అదేశించారు.

నేటి నుంచి ఎంఎస్ఎంఇల సర్వే

● జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నాగరాజారావు

నాగ రాజారావు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) సర్వే ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జి. నాగరాజరావు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అన్ని రంగాల్లో ఎంఎస్ఎంఈలను గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి సమగ్ర మార్గదర్శకాలను జారీచేసినట్లు చెప్పారు. ఈనెల 29న ప్రారంభించి వచ్చే ఫిబ్రవరి 1వ తేదీ నాటికి సర్వే పూర్తికావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మునిసిపల్, మండలాల పరిధిలో జరిగే ఎంఎస్ఎంఈల సర్వేలకు కమిషనర్లు, ఎంపీడీఓలు నోడల్ అధికారులని, జిల్లా స్థాయిలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ నోడల్ అధికారిగా ఉంటారని పేర్కొన్నారు. సర్వే కోసం ప్రభుత్వం ఒక మొబైల్ యాప్ ను రూపొందించిందన్నారు. యాప్ ద్వారా వివరాలు సేకరించేందుకు వార్డు, గ్రామ సచివాలయాల నుంచి ఆరుగురు సిబ్బందిని తీసుకోవాలని కమిషనర్లకు, ఎంపిడిఒ లకు సూచించినట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా జిల్లాలోని ఎంఎస్ఎంఈల వివరాలతో పాటు ఉదయం పోర్టల్ లో నమోదు కావాలని, అందులో భాగంగా యాప్ ద్వారా వివరాలు సేకరించే విధానంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి సచివాలయ సిబ్బంది ఒక్కొక్కరూ రోజుకు కనీసం ఆరు సర్వేలు పూర్తిచేయాలని, ఆ దిశగా ఆరుగురు సిబ్బంది వెరసి 36 సర్వేలు రోజులో పూర్తిచేస్తారన్నారు. గతంలో సర్వే చేసిన వాటికీ సర్వే చేయడం జరుగుతుందని, రోజు వారీ వివరాలు డాష్ బోర్డుపై కనిపిస్తాయని, తద్వారా మునిసిపల్, మండలాల పరిధిలో ఏ మేరకు సర్వే జరిగిందో పర్యవేక్షిస్తామన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న మళ్ల సురేంద్ర

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో భాగంగా ఐదవ రోజు గురువారం మండలంలో భీమవరం,. పరవాడపాలెం గ్రామాలలో వృద్ధులకు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉగ్గిని రమణమూర్తి, మాజీ సర్పంచ్ లు మేడిశెట్టి నూకరాజు, పచ్చికూర విజయ రామచంద్ర, తురుకులపూడి సూరిబాబు, ఎస్ఎం. నాయుడు గంటా అభిమానులు, మహిళలు ,కూటమి నేతలు పాల్గొన్నారు

సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ

అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రజలలో అవగాహన, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టంగా నిర్వహించాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాలనివారణపై ఆర్అండ్‌బి, రవాణా, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు ఎస్‌బి డిఎస్‌పి బి.అప్పారావు, అనకాపల్లి. పరవాడ డిఎస్‌పిలు ఎం. శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జిఆర్ఆర్.మోహన్, ఆర్అండ్‌బి ఇఇ రమేష్, ఎంవిఐలు ప్రకాశరావు, మూర్తి, గోపీకృష్ణ, టిడిఆర్‌బి ఎస్ఐ విక్టోరియా రాణి, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

గంగాధర్ మాస్టారును సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- పరవాడ: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పరవాడ మండల కేంద్రానికి చెందిన బాపడుపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధర్‌ను పరవాడ గ్రామంలో యంగ్ మెన్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు మాజీ సర్పంచ్ చుక్కా రామునాయుడు మాట్లాడుతూ గంగాధర్ మాస్టర్‌కు అనకాపల్లి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావడం గర్వించదగ్గ విషయమన్నారు కార్యక్రమంలో అసోసియేషన్ పెద్దలు,గ్రామ వార్డు మెంబెర్స్ పోతల అప్పలనాయుడు, గండి ఈశ్వరరావు, పరవాడ జగదీష్, చుక్కా నోమో, రెడ్డి నారాయణరావు, గొర్లి శ్రీనివాసరావు, కసిరెడ్డి అప్పలరాజు, పిళ్లా జగదీష్, ద్వారాపూడి శ్రీనివాస్, చుక్కా అప్పలనాయుడు, చుక్కా గోపి, గండి సురేష్, బండారు ఆనంద్, బొడ్డు సత్యనారాయణ మాస్టర్, సతీష్ మాస్టర్, తేలు రమనాజీ, పైల నాయుడు, రాజాన దివాకర్, పైల జగదీష్, శ్రావణ్, నాని పాల్గొన్నారు.

2న విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయండి

ఆందోళనపై ప్రచారం చేస్తున్న ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు :వచ్చేనెల 2న విశాఖ డెయిరీ ముట్టడి ఆందోళనను పాడి రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగలు ముత్యాల నాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఎ.కోడూరు,. కొత్త అగ్రహారం గ్రామాలలో మండల రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ ఆధ్వర్యంలో పాడి రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తగ్గించిన ఆవు పాల సేకరణ ధర పెంపు, డెయిరీ సరఫరా చేస్తున్న పశు దాణాకు 75శాతం రాయితీ ఇవ్వాలని విశాఖ డెయిరీని 1964 సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని, ఇతర ప్రయోజనాలను కల్పించాలని కోరుతూ ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు.

అచ్యుతాపురం :పాలసేకరణ ధర పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 2న విశాఖ డెయిరీ ముట్టడి ఆందోళన జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, అచ్చుతాపురం మండల కన్వీనర్ కె. సోమునాయుడు కోరారు. గురువారం భోగాపురం ,జంగులూరు గ్రామాల్లో పాల కేంద్రాల వద్ద రైతులతో కలిసి నిరసన చేపట్టారు. దీనిపై ఈ సందర్భంగా రైతులు తో మాట్లాడుతూ విశాఖ విజయ డైరీ అర్ధాంతరంగా ఆవుపాలకు మూడు గత నెల 29, విశాఖ డెయిరీ వద్ద పెద్ద ఎత్తున ధర్నా జరిపామని, నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలకు, మంత్రులకు, జిల్లా కలెక్టర్లకు వినతులు ఇచ్చామన్నారు. అసెంబ్లీలో పెద్ద చర్చ జరిగి ,హౌస్ కమిటీ వేయడానికి ఎమ్మెల్యేల తీర్మానం చేశారని అయినా డైరీ యాజమాన్యం తగ్గించిన పాల ధరను పెంచలేదన్నారు. దీనికి నిరసనగా చేపట్టే ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామునాయుడు, సత్యం, అప్పలనాయుడు పాల్గొన్నారు .

అచ్యుతాపురంలో పాల సేకరణ కేంద్రం వద్ద నిరసన

సౌర విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

- పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహనలో కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- సబ్బవరం : సోలార్ విద్యుత్‌తో తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తి చేయడమే కాకుండా విద్యుత్‌ను ఆదా చేయవచ్చునని ఇలా ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు గురువారం. మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు కనెక్షన్లు పెట్టుకోవడం ద్వారా ఇంటి అవసరాలు పోను మిగులు విద్యుత్తును ప్రభుత్వానికి అమ్ముకోవచ్చునని, దీని ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. సోలార్ విద్యుత్‌తో వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించి, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడం ద్వారా పర్యావరణహితమైన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చునన్నారు. ఇంటింటా మొక్కలను నాటడంతోపాటు సోలార్ విద్యుత్ వినియోగంతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ప్రతిఒక్కరూ సోలార్ విద్యుత్ కనెక్షన్లకు పెట్టుకోవాలని కోరారు. ఎపి కోపరేటివ్ అయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, రానున్న రోజుల్లో లారీలు, బస్సులు, కార్లు సోలార్ విద్యుత్తుతో నడిచే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

ఈ సందర్భంగా .గుల్లేపల్లిలో 517 ఇళ్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్స్ కోసం పేర్లు నమోదు చేసుకోగా, 57 మందికి కనెక్షన్స్ కోసం డబ్బులు చెల్లించారని, వారికీ ఫీజిబిలిటీ సర్టిఫికెట్స్‌ను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూరి కుమారి, రాము నాయుడు డిపిఒ ఆర్ శిరీషారాణి, ఎంపిడిఒ పి పద్మజ, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, సర్పంచ్ బండారు మంగ శ్రీను, మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడు మహాలక్ష్మినాయుడు, దొడ్డి సూర్యప్రకాష్, కూటమి నేతలు బుదిరెడ్ల కనకరాజు, పడాల వెంకటరమణ, కర్రి కనకరాజు, పెద్దడ రమణమ్మ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి.ప్రసాద్, ఇఇలు కె.రాజశేఖర్, . డిఇఇ లు నిరీక్షణ, అంబేద్కర్, ఎఇఇలు అశోక్, వీరేంద్ర పలువురు సర్పంచులు ఎంపిటిసిలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫీజిబిలిటీ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రవల్లిక ప్రతిభ

ప్రవల్లికను సత్కరిస్తున్న హిమశేఖర్ డిగ్రీ కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - అనకాపల్లి : పట్టణంలోని హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో బియస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్న కేదారిశెట్టి ప్రవల్లిక సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలలో రజత పతకం సాధించింది. తమిళనాడులోని సేలం సదరన్ రైల్వే సేలం డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో జూనియర్స్ 84 కేజీల విభాగంలో ప్రవల్లిక 330 కేజీల బరువు నెత్తి ఈ పతకాన్ని సాధించారు. ఈ పోటీలలో ఆమె ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె శ్రీధర్ ప్రవల్లికను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఆఫీసర్ ఎంజి.రాజకుమార్, అధ్యాపకులు కే సీతారాం, కే.రమణ, పీ. ధర్మలింగం, పి నర్సింగరావు, రాజకుమారి, కాజల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగ ధ్రువీకరణ పత్రాల అందజేత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వికలాంగ లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా కింద రూ.15వేలు సాయం పొందేందుకు ముమ్మిడిశెట్టి కాశీబాబు, పడాల సోములమ్మ అనే ఇద్దరు లబ్ధిదారులకు 90శాతం వైకల్యం ధ్రువీకరిస్తూ వైద్యులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను గురువారం స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంకిన అప్పలనాయుడు, మాజీ ఎంపిటిసి గొన్నాబత్తుల శ్రీనివాస్, ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ వ్యాధిపై గురువారం కొత్తూరు పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ ఎ. విశ్వనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలునిర్వహించారు. అనుమాని తులను గుర్తించి చికిత్సలు అందించారు. మంచి ఆహారపు అలవాట్లు, దంత శుభ్రత గూర్చి వివరించారుఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి నూతన ధర్మకర్తల మండలి సభ్యులు గురువారం పట్టణంలోనిజనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసారు. 80వ వార్డు అధ్యక్షులు బిఎస్ఎంకె జోగినాయుడు నేతృత్వంలోఎమ్మెల్యేకు జ్ఞాపిక బహుకరించి దుశ్శాలువా వేసి ఘనంగా సత్కరించారు. ధర్మకర్తల మండలి సభ్యులు మారిశెట్టి భాస్కరరావు,పెంటకోట చంద్రరావు, శ్రీకాకుళం గణపతి, తురకలపూడి ఈశ్వర్, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - యలమంచిలి : సమాచార హక్కు చట్టం చాలా బలమైనదని యలమంచిలి వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ పౌరులు అడిగిన అన్ని ప్రశ్నలకూ అధికార్లు 30 రోజుల్లో సమాచారం అందించాలని వివరించారు. సెక్షన్ 4(1) ప్రకారం సమాచారానికి చెందిన అన్ని రికార్డులు, రిజిస్టర్లను నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖల సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అవగాహన శిబిరంలో మాట్లాడుతున్నఎఒ మోహనరావు

ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే కొణతాలకు విన్నవిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కాంద్రేగుల సత్యనారాయణ కోరారు. గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందరభంగా మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై అనధికారికంగా వెళ్లిన సిబ్బందిని వెనక్కి రప్పించాలన్నారు. ఖాళీ పోస్టులను కొత్తగా డిప్యూటేషన్ వేయాలని, కూటమి ప్రభుత్వం విద్యాశాఖ ఆశయాలకు అనుకూలంగా కార్యాలయంలో సేవలు అందేలా కషి చేయాలని కోరారు. భోదనేతర పనులపై ఒత్తిడి లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల జరిగిన రేషనలైజేషన్ సర్దుబాటు ప్రక్రియలో జరిగిన లోపాలను సరిదిద్దాలని, అన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు.

జిల్లాలో కొన్ని మండలాల్లో విద్యాశాఖ అధికారుల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించాలని, మండల విద్యాశాఖలో పూర్తిస్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లను నియమించాలని కోరారు. గిరిజన ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన మహిళా, సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, జిఒ 117 ను తక్షణం రద్దుచేయాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే కొణతాల స్పందిస్తూ, రెండు మాసాల వ్యవధిలో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పెనుమత్స కష్ణంరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తుమ్మపాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనుబాబు పాల్గొన్నారు.

వరిచేను కుప్పలుగా వేసుకోవాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల, బోయిలకింతాడ గ్రామాలలో వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు గురువారం పరిశీలించారు. వరి పంట కోసిన రైతులు వెంటనే కుప్పలు వేసుకోవాలని, కుప్పలు గాలికి ఎగిరి పోకుండా వాటిపై టార్పాలిన్ కప్పి బరువులు పెట్టాలని సూచించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను మూడు రోజులపాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది అందరు రైతులను కలిసి, తుపానులో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాన కల్పించాలని ఆదేశించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్‌వై కాంతమ్మ విస్తరణాధికారి కిరణ్ కుమార్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు ఉన్నారు

కశింకోట : మండలంలోని అడ్డాము, చరకం గ్రామాల్లో అనకాపల్లి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి రామారావు గురువారం పర్యటించారు. రైతులతో కలిసి వరిపొలాలను క్షేత్ర పరిశీలన చేశారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో కోసిన వరిచేను కుప్పలు వేసి, వాటిపై టార్పాలిన్లు వేయాలని సూచించారు. మూడు నాలుగు రోజుల వరకు వరికోతలు వాయిదా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఆళ్ల నూక శ్రీనివాసరావు, ఉద్యానవన సహాయకులు బుద్ధ కిషోర్, ఎంబిబి లక్ష్మి పాల్గొన్నారు

రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ నగరంపాలెం గ్రామంలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తామర్ల కొండబాబు కుటుంబానికి టిడిపి నేతలు అండగా నిలిచారు. సమాచారం తెలుసుకున్న దేవరాపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మొసలి పైడిరాజు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి,25 కిలోల బియ్యం, 3 కేజీల కందిపప్పు, 5 దుప్పట్లు,5 లీటర్ల వంటనూనె,2 చీరలు అందించారు. ప్రమాదం సమాచారాన్ని మండల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు నష్టపరిహారం, ఇతర అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వాలాబు సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, బుజ్జి, టిడిపి సీనియర్ నాయకులు మొసలి తమ్మయ్య, శెట్టి మంగరాజు ఎంపీపీ స్కూల్ చైర్మన్ నాయుడు, ప్రసాద్, రాము, వాలాబు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న టిడిపి నేత పైడిరాజు, తదితరులు

దూడలకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బోదువలస గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. రామ్మోహనరావు గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రెండోవిడత బ్రూసెల్లా వ్యాక్సినేషన్ చేపడుతున్నామని, పశువుల యజమానులు నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల వయసున్న దూడలకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ సందర్భంఆ బోదవలసలో 10 ఆవు పెయ్యలకు, గుల్లేపల్లిలో 12 పెయ్యలకు, మల్లునాయుడు పాలెంలో 8 పెయ్యలకు వ్యాక్సినేషన్ చేసినట్లు వెటర్నరీ డాక్టర్ బి.సంధ్య తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాబర్తి శ్రీనివాసరావు వార్డు సభ్యులు కె.అప్పారావు, కె. రాంబాబు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ కాంద్రేగుల నారాయణరావు, డాక్టర్ కాంద్రేగుల విష్ణుమూర్తి తదితరులను అయ్యప్ప మాలధారణ చేసిన కాంద్రేగుల కుటుంబీకులు గురువారం సత్కరించారు. గురువారం స్థానిక గౌరీ సేవా సంఘంలో వెయ్యి మంది అయ్యప్ప స్వాములకు కాంద్రేగుల ఇంటి పేరు కలిగిన మాలధారణ చేసి, తర్వాత స్వాములకు భిక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా వైద్యులను ఆహ్వానించి వారితోపాటు వ్యాపారవేత్త కాంద్రేగుల శ్రీరామ్ గురుస్వామి, కాంద్రేగుల జోగేంద్ర తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కాంద్రేగుల శ్రీను భాస్కరరావు, గోవింద పాల్గొన

రామ్మూర్తినాయుడికి ఘననివాళి

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడుకు మాజీ జెడ్పిటిసి గాలి రవికుమార్ ఘనంగా నివాళులు అర్పించారు. అన్నమయ్య జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లె గ్రామంలో వారి స్వగృహంలో సినీ నటుడు నారా రోహిత తో కలిసి రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్‌పి మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు ఉన్నారు.

గంజాయి సాగుపై డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో గంజాయి సాగుపై డ్రోన్లతో పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోందని అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి చెప్పారు. మండలంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అరకు సీఐ హిమగిరి ఆధ్వర్యాన గిరిజన గ్రామాల్లో డ్రోన్లతో గురువారం సర్వేను నిర్వహించారు. మండలంలోని అమలగుడ, బీజుమరవలస, కింజేరు, వసబంద, బీజుమరవలస సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ, అరకు సర్కిల్ పరిధి గిరిజన గ్రామాల్లో గంజాయి సాగు లేకుండా చూడాలన్నదే ఎస్పీ లక్ష్యమన్నారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. గంజాయి సాగు, రవాణా చట్ట విరుద్ధమన్నారు. గంజాయి సాగు విడనాడి ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టి ఆర్థికంగా ఎదగాలన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

మహనీయుడు.. జ్యోతిరావు పూలే

- వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బలహీన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కొనియాడారు. ఆయన సమసమాజ స్థాపనకు పాటుపడటంతో పాటు పేదలకు అన్ని విధాలుగా అండగా నిలిచారని పేర్కొన్నారు. గురువారం పూలే వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక నౌరోజీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జివిఎంసి ఏడిసి రమణమూర్తి, బిసి సంక్షేమ అధికారి శ్రీదేవి, బిసి సంఘం ప్రతినిధి పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌పార్కు కూడలిలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పూలే సంస్కరణలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైసిపి నేతలు పల్లా చినతల్లి, జాన్ వెస్లీ, డిఎం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళ లర్పించారు. కార్యక్రమంలో ఇపిడిసిఎల్ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎన్‌వి.రమణమూర్తి, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో పూలమాల వేస్తున్న నాయకులు

జనసేన పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, కందుల నాగరాజు, పీతల మూర్తి యాదవ్, కంటిపాము కామేశ్వరి, గోలగాని వీరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో వైసిపి ఒకటో జోన్ బిసి సెల్ అధ్యక్షులు కొంద్రు రామ సూరప్పడు అధ్వర్యాన పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లిపిల్లి నరసింగరావు, వి.కొండబాబు, కదిరి ఎల్లాజీ, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎ.సూర్యప్రకాశరావు, ఆర్ ప్రభాకర్‌నాయుడు తది తరులు పాల్గొన్నారు

మాధవధార : కంచరపాలెంలోని బిఎస్‌ఆర్ భవన్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నాగేశ్వరరావు, సానబోయిన అప్పలరాజు, టి.లక్ష్మీకాంతం, పి.సావిత్రి, పి.రామారావు, టైలరింగ్ మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు పూలే చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్నోహన్, సిరసపల్లి సన్యాసిరావు, దాడి అప్పారావు, మల్ల గణేష్, కర్రి మల్లేశ్వరరావు, విల్లూరి రమణబాబు, సాలాపు నాయుడు, దాడి వేణు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని పూలే విగ్రహానికి ఎంపిపి బోదెపు గోవిందరావు నివాళులర్పించారు. ఎంపిడిఒ కొండలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కొల్లి త్రినాథ్, పిట్ల సత్తిబాబు, వెల్లుల శేఖర్‌బాబు, సుంకర మరిడేశ్వరరావు, దూది నరసింహమూర్తి, ఇఒపిఆర్‌డి దీపిక, ఎఇ సోమశేఖర్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పెదబొడ్డేపల్లి వైయస్సార్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి గురువారం వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, తమరాను శ్రీను, కర్రి శ్రీను, చీటీల రాము, మామిడి శ్రీను, షేక్ రోజా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకన్న

పెరిగిన ధరలను తగ్గించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో పెద్ద గుమ్ములూరు గ్రామం శివాలయం ఎదురుగా ఉన్న బొమ్మల పాకలో సిపిఎం ఎస్.రాయవరం, కోటవురట్ల ఏరియా మహా సభ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా సిపిఎం జెండాను జి.డేవిడ్ రాజు ఆవిష్కరించారు. .అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న మాట్లాడుతూ, అడ్డురోడ్డులో సులాభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలన్నారు. అడ్డురోడ్డు నుండి గొట్టివాడ వరకు నర్సీపట్నం వెళ్లే రోడ్డు వేయాలన్నారు. అఙకుకు తారురోడ్డు వేయాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలన్నారు.

విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి

ప్రజాశక్తి-కోటవురట్ల: విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా దృష్టి సారించాలని పి హెచ్ సీ వైద్యులు సీతారామలక్ష్మీ సూచించారు. గురువారం మాకవరపాలెం పీహెచ్సీ సిబ్బందితో కలిసి తామరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు, హిమోగ్లోబిన్ లెవెల్స్, ఎత్తు, బరువు, సహ వివిధ అనారోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. సుమారు 472 మంది విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని క్రమ పద్ధతిలో తీసుకోవాలని, అదేవిధంగా శారీరక శ్రమ కలిగి విధంగా వివిధ పనులు క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అచ్యుతరావు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన మహిళలు

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి -కోటవురట్ల: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 2000 మంది పాల్గొన్నారు. గడిచిన వారం రోజులుగా మండల కేంద్రంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కార్తీక మాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రోడ్డు వేశారు..కల్వర్టు మరిచారు

- అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొంగసింగి గ్రామంలో ముఖద్వారంలో సిసి రోడ్డు నిర్మించినప్పటికీ కల్వర్టు ఏర్పాటు చేయక పోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై అధికారులకు ప్రజాప్రతినిధులకు అనేకసార్లు గ్రామస్తులు మొరపెట్టుకున్నా ఎటువంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో ప్రయాణాలు సాగించే ప్రజలు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పంచాయతీలో రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రమాదభరితంగా ఉన్న ఈ కల్వర్టును నిర్మించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదాల సంభవించక ముందే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

కల్వర్టు లేక ఇక్కట్లు పడుతున్న మహిళలు

శుభ్రం చేయిస్తున్న అధికారులు

ప్రభుత్వ ఆసుపత్రిలో 'పల్లె వనం'

ప్రజాశక్తి-మాడుగుల:స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరుపయోగంగా ఎకరా స్థలంలో పంచాయతీ పాలకవర్గం సహకారంతో జంగిల్ తొలగించి చదును చేశారు. ఈ స్థలంలో జామ, కొబ్బరి వగైరా ఐదు రకాల మొక్కలను నాటడానికి పల్లె వనం కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం నుండి ప్రతిపాదన చేశామని ఎంపీడీఓ కొంకి అప్పారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బీ.చంద్రశేఖరరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి- కోటవురట్ల:గత ప్రభుత్వంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి లాలం కాశీ నాయుడు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా పలు ప్రజా సమస్యలు, వ్యక్తిగత సమస్యలు పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పరిష్కారానికై కూటమి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమం నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తుందన్నారు. హెూం శాఖ మంత్రి అనిత పాల్గొంటారని తెలిపారు, వివిధ సమస్యలపై మండల వాసులు విన్నవించుకోవాలని కోరారు. మండలంలో ప్రధాన సమస్య జల్లూరు వంతెన నిర్మాణం పనులు ప్రారంభించామని, పందూరు వంతెన నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. నర్సీపట్నం -అడ్డురోడ్డు నిర్మాణ పనులు 200 కోట్లతో శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాశీ నాయుడు

ప్రజా దర్బార్ ఏర్పాట్లు పరిశీలన

నక్కపల్లి :నక్కపల్లిలో తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఈనెల 29న శుక్రవారం నిర్వహించనున్న ప్రజా దర్బార్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెూం మంత్రి వంగలపూడి అనితతో పాటు జిల్లా అధికారులు, స్థానిక అధికారులు ప్రజా దర్బార్ లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నారు. ఈ మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి ప్రజలు రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాయకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.అనకాపల్లి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, పాయకరావుపేట నియోజకవర్గం ప్రత్యేక అధికారిని మనోరమ, తహసిల్దారు నరసింహమూర్తి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి సీతారామరాజు, డిటి అన్నాజీరావు పాల్గొన్నారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న వెంకటేష్

నేడు హాకీ టీం ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పురుషుల హాకీ టీం ఎంపికలు జరగనున్నాయని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివయ్య, డైరెక్టర్ కే. దుర్గారావులు గురువారం తెలిపారు. ఈ ఎంపికలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు డిశంబర్ 3నుండి 8వ తేదీ వరకు చెన్నయ్ ఎం ఆర్.కే స్టేడియం లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ మెన్ టోర్నమెంట్ లో పాల్గొంటారని తెలియజేశారు.

రైతన్నలకు చివరి కష్టాలు

- ఓ వైపు తుపాను గుబులు - మరో వైపు తెగుళ్ల బెడద- ఆందోళనలో అన్నదాతలు

వడ్డాదిలో దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:

రైతుల్లో ఓ వైపు తుఫాను, మరో వైపు తెగుళ్ల గుబులు రేకెత్తిస్తున్నాయి. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో అన్నదాతలు ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. చివరి గింజలు చేతికందే సమయంలో తుఫాను గండం, తెగుళ్ల బెడద రైతులకు కునుకు లేకుండా చేస్తుంది.

నక్కపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మునుపెన్నడూ లేని విధంగా 4400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వరి ఆశాజనకంగా ఉంది. అన్నిచోట్లా వరి కోత దశకు చేరుకుంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వాతావరణం లో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాతకు చినుకు భయం పట్టుకుంది. కోత దశకు చేరుకున్న వరి చేతికి అందుతుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి వరి పంటను పండించారు. పలువురు రైతులు అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టారు. ఈ దశలో తుఫాను ప్రభావంతో భారీ వర్షం కురిసినట్లయితే అన్నదాతకు తీవ్ర నష్టం జరుగుతుంది.అప్పుల ఊబిలో రైతులు కూరికిపోతారు. అధిక పెట్టుబడులు అయినప్పటికీ వరి సాగు ఆశాజనకంగా ఉండటంతో, పెట్టుబడుల నుండి బయటపడతామన్న ఆశతో రైతులు ఉన్నారు. ఇటువంటి సమయంలో తుఫాన్ హెచ్చరిక అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటన చేసి వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. ఇప్పటికే కోసి పొలాల్లో ఉన్న వరి పనలను వెంటనే కుప్పలు వేసుకోవాలన్నారు.

అంతుచిక్కని తెగుళ్లు

వడ్డాది: ప్రకృతి వైపరీత్యంతో రైతులు తరతరాలుగా నష్టపోతున్నాడు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో పడటంతో వ్యవసాయానికి అనుకూలంగా ఉందని రైతులు వరి పంటలను బాగా పండుతున్నాయని సంతోషిస్తున్న రైతులకు తుపాను, తెగుళ్ల బెంగ పట్టుకుంది.

వరి పైర్లపై రెల్లిరాల్చు పురుగులు దాడి చేస్తున్నాయి. సాయంత్రం వేళలో వరి పొలాలపై ఈ పురుగులు దాడి చేస్తున్నాయి. రాత్రంతా వరిపై దాడిని కొనసాగిస్తున్నాయి. మరుసటి రోజు చూస్తే వరి ఎన్ను అంతా నేలపాలవుతోంది.

బుచ్చయ్యపేటలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతులు

వరి ఎన్ను పూర్తిగా రెక్కలు విరిగి కింద పడిపోతుంది. ఎంత తొందరగా విస్తరిస్తుందంటే కొన్ని గంటల్లోనే ఎకరాల ఎకరాలు రాలి పోతున్నాయి. ఇది చూసిన రైతులు లభో దిబో అని గోల పెడుతున్నారు. వ్యవసాయ అధికారులు కూడా చూసి విస్తుపోతున్నారు. కొంతమంది రైతులు పురుగుల మందులు కొడుతున్నారు. కొన్నిచోట్ల వారానికి రెండు మూడు సార్లు కూడా ఈ మందులు కొట్టవలసి వస్తుంది. ఈ పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలు ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

మబ్బులతో రైతుల పరుగులు

బుచ్చయ్యపేట: అల్పపీడనం ప్రభారంతో వాతావరణం లో

నక్కపల్లిలో దెబ్బతిన్న వరి పంట

మబ్బులు వేయడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. పండిన వరి పంట ఏమాత్రం చిరుజల్లుల కురిసినా నష్టపోక తప్పదు. వరి పంటను దక్కించుకోవడానికి పరుగులు తీస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట చేతికి వచ్చే సమయం .. దీంతో గత కొద్ది రోజులుగా రైతులు వరి పంటను కోసి పొలాల్లో విడిచిపెట్టారు. నాలుగైదు రోజులు పాటు ఆరిన తర్వాత కుప్పలుగా పెట్టడానికి ఏర్పాట్లు చేసుకున్నాను. గత రెండు రోజులుగా అల్పపీడనం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీంతో గురువారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులు ఏర్పడడం, చల్లటి గాలులు వీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.పొలాల్లో కి పరుగులు తీశారు. కోసిన పంటను కుప్పలుగా పెట్టడం, లేదా ట్రాక్టర్లలో ఎక్కించి వేరొక ప్రదేశంలో కుప్పలు పెట్టడానికి సిద్ధమయ్యారు. పంటను రక్షించుకోవడానికి రైతుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

తెగులు సోకిన వరి పంట

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

బెల్టు షాపు ఏర్పాటుకు యత్నం

- అడ్డగించిన పోలీసులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని పేటసూది పురం గ్రామంలో మద్యం బెల్టుషాపు ఏర్పాటను పోలీసులు అడ్డగించారు. గురువారం ఉదయం గ్రామంలో దండోరా ద్వారా బెల్టు షాపు ఏర్పాటుకు గ్రామస్థులకు తెలియచేసిన పెద్దలు గ్రామంలో పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన దాసిన రమణబాబు అను వ్యక్తి 201000 రూపాయలకు షాపును పాడుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ముందుగా లక్షరూపాయలు గ్రామకమిటికి జమచేసి మిగిలిన మొత్తం వారు పెట్టిన షరతు ప్రకారం చెల్లించాల్సి ఉంది.

మండలంలో పేటసూదిపురంలో గురువారం బహిరంగ మద్యం వేలం పేటను ఎస్‌ఐ విభూషణ్‌రావు అడుకున్నారు. గ్రామంలో పెద్దలను కలిసి ఇలాంటి చట్ట విరుద్ధ కార్యక్రమంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ఆయన తెలపడంతో గ్రామ పెద్దలు తెలియజేశారు. దీంతో ఈ విషయంపై ఆలోచన చేపట్టి గ్రామ సర్పంచ్ శివ, గ్రామ పెద్దలు అందరూ కూడా కలిసి గ్రామంలో మద్యం నిషేధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వజ్రపు శంకర్రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పామాయిల్‌తో అధిక ఆదాయం

ప్రజాశక్తి - రావికమతం:రైతులు పామాయిల్ తోటల సాగుపై దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ అధికారిణి భాను పుష్ప తెలిపారు. ఆమె మండలంలో మరుపాక, వంట్లమామిడి, పాలెం గ్రామాల లో సాగు చేస్తున్న పామాయిల్ తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పామాయిల్ తోటల పై వస్తున్న ఆదాయంపై రైతులకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో సాగు చేయడం లేదన్నారు. పామాయిల్ పెంపకానికి ప్రభుత్వం వివిధ రకాల రాయితీలు అందిస్తుందన్నారు.

పరిశీలిస్తున్న భాను పుష్ప

దీపోత్సవంపై సమీక్షా సమావేశాలు

ప్రజాశక్తి -పద్మనాభం : ఈ నెల 30వ తేదీన జరిగే అనంతపద్మనాభ స్వామి కొండ దీపోత్సవానికి అన్ని శాఖల అధికారులు గురువారం ప్రత్యక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యాన కుంతీ మాధవస్వామి కల్యాణమండపంలో పద్మనాభస్వామి ఆలయ ఈవో నానాజీబాబు ఆధ్వర్యాన, పద్మనాభం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎసిపి అప్పలరాజు ఆధ్వర్యాన దీపోత్సవం ఏర్పాట్లు, నిర్వహణపై పత్రిక ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కృషి చేయాలని, దీనికి అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. భక్తుల రాకపోకలకు ఏర్పాట్లుచేశామన్నారు. విజయనగరం నుంచి వచ్చే భక్తులకు చిన్నాపురం నుంచి పద్మనాభం వరకు ఆర్‌టిసి సహకారంతో ఆరు బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఇదే రూట్లో బైక్‌లు, ఆటోలపై వచ్చిన వారికి ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. నీళ్ల కుండీలు వైపు నుంచి వచ్చిన భక్తులకు అనంతవరం జంక్షన్ వరకు అనుమతి ఉందని, అక్కడి నుంచి ఆరు సెటిల్ సర్వీసులతో మద్ది పెట్రోల్ బంక్ వరకు ప్రత్యేక బస్సులు తిరుగుతాయని వివరించారు. ఇదే రూట్‌లో బైకులు, ఆటోలు ఇతర వాహనాలు రాకపోకలకు మద్ది జంక్షన్లో రెండు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, మండల టిడిపి మాజీ అధ్యక్షులు కె.నగేష్‌కుమార్, కృష్ణాపురం ఎంపిటిసి కె.లక్ష్మినాయుడు, పద్మనాభం సిఐ శ్రీధర్, ఎస్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించిన తర్వాతే..

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించిన తర్వాతే పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపనలు, పరిశ్రమలు ఏర్పాటు చేయడం చేయాలని లేనిపక్షంలో నిర్వాసితులతో కలిసి ఆందోళన చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు హెచ్చరించారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో రాజయ్యపేట, బోయపాడు, బుచ్చి రాజుపేట, చందనాడ,వేంపాడు, అమలాపురం, డిఎల్ పురం రెవెన్యూ పరిధిలోని 5,500 ఎకరాలు ప్రభుత్వం రైతుల దగ్గర సేకరిస్తున్నారని తెలిపారు. ఎకరా జిరాయితీ భూమికి రైతులకు 18 లక్షలు, డి ఫారం భూములకు 12 లక్షల 60 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించారన్నారు. జిరాయితీ భూములతో సమానంగా ఢి ఫారం భూములకు కూడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల దగ్గర తీసుకున్న భూములను ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలకు ఎకరా 51.39 లక్షల రూపాయలకు అర్సాలార్ మిట్టల్,నిప్పన్ స్టీల్ కు అధిక ధరకు అమ్ముకుంటున్నారని, ఆ ధర రైతులకు, డి పట్టా, సాగుదారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల భూములను తక్కువ ధరకు ప్రభుత్వం తీసుకుని తీవ్ర అన్యాయం చేసిందన్నారు.నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించాలన్నారు.18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి 2013 భూ సేకరణ చట్ట ప్రకారం 5 సెంట్ల ఇంటి స్థలం, 25 లక్షల రూపాయలు స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఎప్పటికి భూములు స్వాధీనం చేసుకుంటారో అప్పటి కీ కటాఫ్ తేదీగా భావించి అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-పెదబయలు:పెదబయలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (హైస్కూల్)లో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థుల హాజర పట్టికను పరిశీలించారు. పాఠశాలలో విద్యా బోధనపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను తప్పక పాటించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్‌ఆర్సిపి నాయకులు ఉన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		